# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విపత్తు సమయాల్లో దేశ ప్రజలకు తక్షణ సమాచారం అందించేందుకు "సెల్ బ్రాడ్‌కాస్ట్ సిస్టమ్"ను కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు.
- ❖ కమ్యూనికేషన్స్ రంగ నిపుణుడు ప్రసూన్ జోషిని భారత ప్రభుత్వ ప్రసార సంస్థ ప్రసార భారతి ఛైర్మన్‌గా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నియమించింది.
- ❖ పశ్చిమ బెంగాల్‌లోని 15 పోలింగ్ కేంద్రాల్లో ఈరోజు రీపోలింగ్ జరిగింది.
- ❖ చెన్నై వేదికగా ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విపత్తు సమయాల్లో దేశ ప్రజలకు తక్షణ సమాచారం అందించేందుకు స్వదేశీ సాంకేతికతతో కూడిన "సెల్ బ్రాడ్‌కాస్ట్ సిస్టమ్"ను కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈరోజు ప్రారంభించారు. టెలికమ్యూనికేషన్ల శాఖ పరిధిలోని "సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్" (C-DOT), నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (NDMA), కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలిసి అభివృద్ధి చేశారు. ఈ వ్యవస్థ పనితీరుపై ఈరోజు దేశ వ్యాప్తంగా విజయవంతంగా పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా దేశంలోని మొబైల్ ఫోన్లకు అత్యవసర హెచ్చరిక సందేశాలను పంపారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... విపత్తు సమయంలో వేగంగా సమాచారాన్ని అందించడంలో ఇది ఒక ముందడుగు అని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కమ్యూనికేషన్స్ రంగ నిపుణుడు ప్రసూన్ జోషిని భారత ప్రభుత్వ ప్రసార సంస్థ ప్రసార భారతి ఛైర్మన్‌గా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ రోజు నియమించింది. ప్రసూన్ జోషి సినీ గేయ రచయితగా, సామాజిక స్పృహ కలిగిన కథా రచయితగా, ప్రకటనల రంగంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈ నియామకంపై కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందిస్తూ... ప్రసూన్ జోషి ప్రకటనలు, సాహిత్యం, కళలు, సినిమా రంగాలలో

ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన అరుదైన సృజనాత్మక వ్యక్తి అని ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో ప్రసార భారతి కొత్త శక్తిని, సరికొత్త సృజనాత్మక గళాన్ని పొందుతుందనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. గతంలో ప్రసూన్ జోషి ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (CBFC) అధ్యక్షుడిగా కూడా పని చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా 2026-27 సంవత్సరానికి గాను నాలుగు పార్లమెంటరీ కమిటీలను ఈ రోజు పునర్ వ్యవస్థీకరించారు. 30 మంది లోక్‌సభ సభ్యులతో కూడిన అంచనాల కమిటీకి ఛైర్మన్‌గా లోక్‌సభ బీజేపీ ఎంపీ డాక్టర్ సంజయ్ జైస్వాల్ నియమితులయ్యారు. బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా ఛైర్మన్‌గా, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీని 15 మంది లోకసభ, 7 గురు రాజ్య సభ సభ్యులతో ఏర్పాటు చేశారు. 15 మంది లోక్‌సభ 7 గురు రాజ్యసభ సభ్యులతో కూడిన ప్రభుత్వ ఖాతాల కమిటీ కి ఛైర్మన్‌గా లోక్‌సభ కాంగ్రెస్ ఎంపీ కె.సి. వేణుగోపాల్‌ను నియమించారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీకి లోక్‌సభ బీజేపీ ఎంపీ ఫగ్గన్ సింగ్ కులస్తే నేతృత్వం వహిస్తారు. ఈ కమిటీలో 20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉంటారు. ఈ కమిటీల పదవీ కాలం ఈ నెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు ఉంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 15 పోలింగ్ కేంద్రాల్లో ఈరోజు రీపోలింగ్ జరిగింది. వీటిలో మగ్రాహత్ పశ్చిమ నియోజకవర్గంలోని 11 బూత్‌లు, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని నాలుగు బూత్‌లు ఉన్నాయి. సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 87 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. అసెంబ్లీ ఎన్నికల రెండో దశలో భాగంగా గత నెల 29వ తేదీన ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది. సంబంధిత రిటర్నింగ్ అధికారులు, పరిశీలకుల నుండి అందిన నివేదికల ఆధారంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ రీపోలింగ్ నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో ఈ నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగనున్ననేపథ్యంలో ఎన్నికల కమిషన్ అదనపు పరిశీలకులను నియమించింది. ఓట్ల లెక్కింపు పరిశీలకులకు సహాయం చేయడానికి మొత్తం 165 మందిని అదనంగా కేటాయించగా... కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను బలోపేతం చేయడానికి, శాంతిభద్రతలను పర్యవేక్షించడానికి 77 మంది పోలీస్ పరిశీలకులను నియమించింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సురక్షితంగా, ప్రశాంతంగా, ఎటువంటి భయాందోళనలు లేని వాతావరణంలో, పారదర్శకంగా జరిగేలా చూసేందుకు అదనపు పరిశీలకులను నియమించినట్లు ఎన్నికల కమిషన్ తెలియజేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ - కాశ్మీర్ లోయ మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ సర్వీసు ఈరోజు అధికారికంగా ప్రారంభమయ్యింది. ఈ రైలు ఉదయం 6 గంటల 20 నిమిషాలకు జమ్మూ నుండి బయలుదేరింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ రైలును జెండా ఊపి ప్రారంభించారు. దీనిని జమ్మూ కాశ్మీర్‌కు ఒక ప్రధాన మైలురాయిగా ఆయన అభివర్ణించారు. మొదటి రెగ్యులర్ సర్వీసులో ప్రయాణించిన ప్రయాణికులు, ఈ హై-స్పీడ్ రైలు సేవను ప్రవేశపెట్టినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రాజధాని ఢిల్లీలో రాబోయే రెండు రోజుల్లో వర్షాలు, ఉరుములతో కూడిన గాలులు వీచే అవకాశం ఉన్నందున భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఈరోజు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రేపు, ఎల్లుండి ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇదిలా ఉండగా ఈరోజు అస్సాం, మేఘాలయ, సిక్కిం, హిమాలయ పరివాహక పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఎయిమ్స్ ఢిల్లీ  భారతదేశంలోనే మొట్టమొదటి పోర్టబుల్ బెడ్‌సైడ్ మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్ (MRI) వ్యవస్థను ఈ రోజు ప్రవేశపెట్టింది. దీనివల్ల ఐసీయూ, ఎమర్జెన్సీ, న్యూరో సర్జికల్ విభాగాల్లోని తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులకు వారి మంచం వద్దే వేగంగా బ్రెయిన్ ఇమేజింగ్ పరీక్షలు నిర్వహించడం సాధ్యమవుతుంది. ఈ అల్ట్రా-లో-ఫీల్డ్ పరికరాన్ని నేరుగా రోగి వద్దకే తీసుకువెళ్లవచ్చు. దీనివల్ల రోగులను ప్రత్యేక ఎంఆర్ఐ గదులకు తరలించాల్సిన అవసరం ఉండదు. దేశంలో రోగుల వద్దకే తీసుకువెళ్లి ఎంఆర్ఐ పరీక్షలు నిర్వహించడం ఇదే మొదటిసారి.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇంగ్లాండ్ లో జరగనున్న 2026 ఐసీసీ మహిళల టీ-20 ప్రపంచ కప్ కోసం భారత మహిళల జట్టును బీసీసీఐ ఈరోజు ప్రకటించింది. ఈ జట్టుకు హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యం వహించనుండగా... స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ఈ టోర్నమెంట్ జూన్ 12న ప్రారంభం కానుండగా, ఫైనల్ మ్యాచ్ జూలై 5న లార్డ్స్ క్రికెట్ మైదానంలో జరగనుంది. గ్రూపు-ఏ లో ఉన్న భారత మహిళల జట్టు తన తొలి మ్యాచ్‌ను జూన్ 14న ఎడ్జ్ బాస్టన్‌లో పాకిస్థాన్‌తో ఆడనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా చెన్నైలోని ఎం.ఎ. చిదంబరం స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన ముంబై 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ప్రయాణికుల రద్దీని దృష్ట్యా ఉంచుకుని ఈస్ట్ కోస్ట్ రైల్వేకు చెందిన వాల్తేరు డివిజన్ ప్రయాణీకులకు సహాయం చేసేందుకు పలు చర్యలను చేపట్టింది. వేసవి కాలంలో ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలని డివిజనల్ రైల్వే మేనేజర్ (DRM) లలిత్ బోహ్రా అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు డివిజన్‌లోని అన్ని ప్రధాన స్టేషన్లలో ప్యాక్ చేసిన స్వచ్ఛమైన నీటి సరఫరాకు తగిన ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా జనరల్ కోచ్‌లలో ప్రయాణించే వారి కోసం ఉచిత తాగునీటి సదుపాయం కల్పిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైళ్ల రాకపోకల వివరాలను క్రమం తప్పకుండా ప్రకటిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లో ఈరోజు కాంకేర్-నారాయణపూర్ జిల్లాల సరిహద్దులో చోటేబెతియా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఐఈడీ పేలుడులో నలుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, ఒకరు గాయపడ్డారు. గతంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేసేందుకు డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) బృందం మైన్ల తొలగింపు ఆపరేషన్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ పేలుడులో ఇన్‌స్పెక్టర్ సుఖ్‌రామ్ వట్టి, కానిస్టేబుళ్లు కృష్ణ కోమ్రా, సంజయ్

గఢ్‌పలే, పరమానంద్ కోమ్రా తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మరణించారని బస్తర్ రేంజ్ ఐజీ పి. సుందర్‌రాజ్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్‌లో 2027 జనాభా గణనలో భాగంగా మొదటి దశ గృహ గణన ప్రక్రియ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. స్వయం గణన కోసం కేటాయించిన 15 రోజుల గడువు నిన్నటితో ముగిసింది. ఈ గృహ గణన ప్రక్రియ ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ప్రక్రియలో భాగంగా శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి అవసరమైన సమాచారాన్ని సేకరిస్తారు. 2027 జనాభా గణనలో రెండవ దశ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =